# నిరపరాధి

కుందుర్తి నరసింహారావుగారు

౧

నిండినయింట్లో ఆనందదేవత గంతులు వేస్తూంది. పెళ్లిసందట్లో పందిరిస్తంభాలు పెళపెళమంటున్నవి. అటూ యిటూ మోటారుకార్లు హడావుడిగా తిరుగుతున్నవి. వాటి చప్పుడు విని దూరంగా కొట్టంలో కట్టివేసివున్న ఆవుదూడలు బెదిరి గంతులువేస్తుంటే, వాటి తోకలు పట్టుకొని ఆడుకుంటూవున్న పిల్లకాయలు దూరంగా తొలిగి చప్పట్లు చరుస్తున్నారు. వాళ్ల గోలకు ఉడుకుబోతుతనం వచ్చి దూడలు ఇంకా అరుస్తున్నవి. వాళ్లు ఇంకా చరుస్తున్నారు.

పెళ్లికొడుకుకారు ముందు నడిచింది. దానివెనకనే ఆడబిడ్డలకారుఅంగలువేస్తూంది. మఱి చుట్టాలందఱికోసం ఏర్పాటుచేసిన మూడుబస్సులూ దానివెనకనే మూలుగుతూ పోతున్నవి. ప్లెషర్ కార్లకంటే పెద్దవైన తమనందఱినీ వెనకవేసి వాటిని ముందు నడిపిస్తున్నారనే ఉక్రోషంచేతనో, తమ సంగీతం వినిపించకుండా లోపల కూచున్న ముత్తైదువలు గడబిడచేస్తున్నారనే కంగారుచేతనో అవి సామాన్యంగా కదలటంలేదు; డ్రైవర్లకు లొంగటంలేదు; వాళ్లు చెవులు మెలివేసినా, చెక్కలు విఱిచినా, కాళ్లతో తన్నినా సహించి వూరుకుంటున్నవికాని ప్రయాణంమాత్రం మనస్ఫూర్తిగా సాగించేట్టు లేదు. చిట్టచివరకు మిగిలింది ఒకచిన్నకారు. అందులో ఒకరిమీద ఒకరు నలుగురు కుఱ్ఱవాళ్లు పడ్డారు. వెనుక సీటులో కుడివైపుగా వాలి ఆనుకొని కూర్చున్న పుండరీకం చేతిలోకి కళ్లజోడు తీసుకొని జేబురుమాలతో తుడుచుకుంటున్నాడు.

అందఱికంటే ముందు దారితీస్తున్న మేళగాళ్లల్లో ఒకడికి చీమ కుట్టింది. వాడు మద్దెల చాలించి మడిమ గోక్కున్నాడు. మద్దెల నిలిచిందని సన్నాయివాడు చాలించాడు. తాళపువాడు దగ్గాడు. మేళం నిలవంగనే ఫర్లాంగు దూరంలో ఉన్న బ్యాండువాళ్లు వెనక్కి తిరిగి చూచారు. ముందు నడుస్తున్న పెద్దమనుష్యులంతా కబుర్లు చాలించి నిలబడ్డారు. కారులన్నీ ఒకటితరువాత ఒకటి క్రమక్రమంగా నిలిచిపోయినవి.

వరసగా పోతున్న పెళ్లివాళ్లను చూడటానికి ముత్తైదువులంతా వచ్చి వాకిళ్లల్లో నిలబడ్డారు. బాలవితంతువులు తలుపుల చాటున నక్కిచూస్తున్నారు. కొత్తపెళ్లికూతుళ్లు మేడలమీదినుంచీ మెరుస్తున్నారు. తలంటిపోసుకొన్న శిరోజములు చిక్కుదీసుకుంటూ సుందరమ్మ మేడమెట్లమీద నుంచోనుంది.

వరసగా నిలుచున్న కార్లలో ఒక్కొక్కటీ కదిలింది. మేళం, తాళం మళ్లీ ప్రారంభించినవి. స్వరం విన్న నాగేంద్రులవలె బస్సు

లన్నీ బుస్సుమన్నవి. శ్రీనివాసరావుగారి యింటి కెదురుగా నిలిచిన చివర కారుమాత్రం కదల్లేదు. డ్రైవరుతమ్ముడు దిగి స్టార్టుచేస్తానన్నాడు; అది వొద్దన్నది; అసహ్యించుకొన్నది; తలవూపింది;తంతా నన్నది. 'అయ్యాగార్లను దింపి, నెట్టనన్నా నెట్టండిరా'అన్నాడు డ్రైవరు. ఆమాట విని పుండరీకం కళ్లజోడు కటిక్కిన పెట్టుకొన్నాడు ; తలుపు తెరిచి తొందరగా దిగాడు. భాస్కరం, ప్రకాశరావు అతనివెంటనే దిగి 'మనంగూడ నెడదాం పట్టండి 'అన్నారు. పుండరీకం నవ్వాడు. రుద్రాక్షంచు ఉత్తరీయం చుట్టచుట్టి సీటులో పడవేసివుంటే తీసుకొని భుజాలమీద ఎగుడు దిగుడుగా వేసుకున్నాడు. కాళ్లకు తొడుక్కున్న ఆకుచెప్పలలో ధోవతిఅంచులు చిక్కుకొంటే వొంగి తీసుకుంటూ "మనం నడిచిపోదాం, భాస్కరం "అన్నాడు.

శ్రీనివాసరావుగారు చెంబు పట్టుకొని మేడమీదనుంచి చరచరా దిగివస్తున్నాడు. మెట్లమీద భార్య నిలబడి వుంది; విడిపోయిన వెంట్రుకలు భుజాలమీద గుత్తులుగట్టి నల్ల త్రాచుల్లాగా వేలాడుతున్నవి; ఎడమమో చేయి మెట్లకటకటాలమీద ఆనుకొని, అరచేతిలో చెక్కిలి వొత్తి అనిమిషనేత్రాలతో చూస్తున్నది; చేతిలోని దవ్వెన మెట్లమీద జారి పడిపోయింది; కుడిచేతి వేళ్లు కటకటాల అంచులమీద మెల్లగా ఆడుతున్నవి, వీణ తంత్రులు మీటుతున్నవి;

'కమలాకుచకలశీభర
విపులీకృత పులకం'

అనే పల్లవి తమలో తామే ఆలాపిస్తున్నవి. "ఇంతపెందలాడే లేచావు. మేళం వినేటప్పటికి మెలకువ వచ్చిందా యేమిటి ?" అంటూ శ్రీనివాసరావుగారు మెట్లు దిగిపోతూవున్నాడు. సుందరమ్మ మాటలాడలేదు. ఆమాటలు ఆమెకు వినబడలేదు.

"అబ్బా! పసిపిల్లలాగా పెళ్లిమేళమంటే ఎంతకులాసా నీకు ?"అని ఆయన ఆగి చూస్తున్నాడు.

"పసిపిల్లను కాదా యేమిటి ?"అని సహజంగా అని ఊరుకున్నది. కాని యేమన్నదో ఆమెకే తెలియలేదు. అంతచనువుగా అన్న మాటతో కలిసి ఆమెమొగముమీద ఒక్క చిఱునవ్వు వస్తేనా! శ్రీనివాసరావుగారికి ముద్దువచ్చినది. "ఎంతచక్కగా మాటలాడుతావే, నీవు !"అన్నా డాయన, చూపులనిండా ఆనందరసం ఒలుకుతూ.

ఈఉషస్సులో, బాలసూర్యకుసుమము చిమ్ముతున్న బంగారుపుప్పొడిలో, మనోమోహనములగు మంగళవాద్యములముందు, స్వర్గసోపానసన్నిభమై యుండవలసిన యీ మేడమెట్టుమీద, ఈదంపతులవద్ద రసాభాస వర్ణింపవలసివచ్చింది. అంతసంతోషపడిన పెనిమిటికి ప్రత్యుత్తరముగా ఒక్క చల్లనిచూపైనా సుందరమ్మ చూడగలిగింది కాదు. ఆమె తల, మొగము, కండ్లు, మనసు, ప్రాణము—

అన్నీ ఆకార్లసందడిలోనే, ఆ ఆగిపోయిన చిన్న కారుమీదే లీనమై వున్నవి. పంతులు గారు కొంచెమునే పట్లాగే చూచి చూచి, ఆగిపోయినకారువంకా, ఆమెవంకా చూచి, మళ్లీ చూచి బెదిరిపోయినాఢు; వెంటనే చెంబు తీసుకొని చరచరా దిగిపోయినాడు.

రోడ్డుమీద సంగతి చూడండి: చుట్టా లంతా ముందు సాగిపోయినారు. వెనకబడితే విడిదిలో ఉప్మా, కాఫీ దొరక్కుండా పోతయి. గంటసేపు నెట్టినా కారుచప్పు డయ్యేట్టు లేదు. దాన్ని భాగుచేసుకుంటూ డ్రైవరు చెమటలు కారుస్తున్నాడు. ప్రకాశరావు 'రావోయ్' అంటూ పుండరీకంచొక్కా సట్టుకు లాగాడు.

"నడిచిపోతే చుట్టాలంతా నవ్వరు టోయ్?"

"అట్టయితే ఇటు కాఫీహోటలుకు పో దాం పద!" అన్నాడు ప్రకాశరావు.

"ఎంత అభిమానం! పరిగెత్తుకు పోయి ఆవెనకకారులో ఎక్కుదాం పద"అని భాస్క రం అన్నాడు. పుండరీకం మొగం చిట్లిస్తూ, "అబ్బే, ఆడవాళ్లబండిలోనా?" అని మళ్లీ నవ్వాడు.

భాస్కరానికి పొట్ట బగల నవ్వు వచ్చింది. "ఆడవాళ్లంటే అట్లా బెదిరిపోతా వేమిటోయ్ నువ్వు! ఆకూచున్న అన్నయ్యా వాళ్లంతా మొగవాళ్లు కారూ? చదువుకునే కుఱ్ఱాడివి. యింకా......"

భాస్కరాన్ని ఇక మాట్లాడనీయకుండా భుజము పట్టుకొని నెట్టాడు, పుండరీకం. అం దఱూ నవ్వుకుంటూ వెనక్కి తిరిగిపోతున్నారు. పుండరీకంగొంతులో ఎప్పుడూ ఒకరాగం ఆడుకుంటూ వుంటుంది. అతని పెదవులమీద ఒకపాట పరిగెత్తుతూ వుంటుంది. ఇతరులు అతణ్ణి ఎగతాళిచేస్తుంటారు. అతడు తల వంచు కొనిపోతూవుంటాడు. ఉత్తరీయంచెఱగులు మాటిమాటికీ జారిపోతున్నవి. అవి మళ్లీ సర్దుకుంటున్నాడు.

ఒక్కొక్క ముత్తైదువా వొంగి గడ పలో ముగ్గులు వేస్తున్నది. కొందఱు ఆడవారు తలుపులు వేసి లోపలికి పోయినారు. పిల్ల కాయలు పెండ్లివారివెంట పడ్డారు. సుందరమ్మ చూస్తూనే నిలుచుంది. ఆమెమనస్సు చెదర లేదు. కాలు కదలలేదు. కారు ఆగిపోయిన చోటనే ఆమెదృష్టి సుస్థిరమై వుంది. అక్కడ మాత్రం ఇప్పు డేపదార్థమూ లేదు. కారూ లేదు, మనుష్యులూ లేరు. కాని ఆమె అక్కడే చూస్తూవున్నది. అయిదునిమిషాలక్రింద ఆమె మనస్సు అక్కడ వ్రాలి ఒకమూర్తిని సృష్టిం చింది. ఆమూర్తి అక్కడనే వుంది, ఆగాలి లోనే, ఆరోడ్డుమీదనే, ఆకారు నిలిచిన చోటనే—సన్నగా, ఊగుతూ, నవ్వుతూ......

౨

వీరయ్యగారి పెళ్లిపందిట్లో వెయ్యి మందిజనం ఉన్నారు. ఒక్కరోజుపెళ్లి కాబట్టి ఊళ్లో పెద్దలంతా ఆవేళే వచ్చారు. పెళ్లికూ

తుర్ని మేనమామ తీసికొనివచ్చి పీటమీద కూర్చోబెట్టాడు. ఆమె వెంటనే సుశీలా, సుందరమ్మామాత్రం అలంకారాలతో వచ్చి వెనక నుంచున్నారు. వచ్చే పేరంటాల నందరినీ వారు సత్కరించవలసివుంది.

పీటలకు ఎదురుగా పెళ్లికూతురుతండ్రీ, అన్నలూ కూర్చున్నారు. వారిపక్కనే భాస్కరం, పుండరీకం తములపాకులూ, అత్తరూ మొదలైనవి పెట్టిన పళ్లె మొకటి ముందు పెట్టుకొని చిల్లరడబ్బులసంచీ వొకటి పట్టుకొని కూచున్నారు. పెళ్లిమంత్రాలు సాగుతున్నా వీళ్లకబు క్లేమిటో వీళ్లు చెప్పుకుంటున్నారు గాని వెనక్కి తిరిగి చూడలేదు. కాసేపటికల్లా పెండ్లికొడుకుకు కట్నం వెండిపళ్లెంలో పెట్టి పది వందరూపాయినోట్లు ఇచ్చారు. అతడు పురోహితుడిచేతి కియ్యగా ఆయన పెండ్లికొడుకు తండ్రి పేర్రాజుగారి కిచ్చాడు. పచ్చపచ్చని ఆపదికాగితాలలో ఎంతవిలువ ఉన్నది? ఆ పెళ్లికూతురుతండ్రి యెన్నాళ్లు అష్టకష్టాలూ పడి అవి సంపాదించాడోకదా! అందరికళ్లూ వాటిమీదే వున్నవి. పేర్రాజుగారు నాలుగు సార్లు వాటిని లెక్కపెట్టుకున్నాడు. కొడుకును కన్నందుకు కృతార్థుడి నైనానుగదా అనుకున్నాడు. వేయిరూపాయలు! కొడుకుకు మెట్రిక్యులేషన్ చెప్పించిన ఖర్చుకు రెట్టింపు వచ్చిందనుకున్నాడు. మళ్లీ బొత్తిని ఒక్కసారి లెక్కపెట్టి, పక్కన వున్న పుండరీకంను పిలిచి, "అబ్బాయీ! ఒకసారి చూడు—బావగారు కౌంటర్ ఫీ ల్లేమన్నా...!" అంటూ నవ్వాడు.

పుండరీకంకూడా సహజమైన చిఱునవ్వు నవ్వుతూ, లెక్కపెట్టి "మంచివేలే, బాబూ! దుంపతెంచక—" అన్నాడు.

సుందరమ్మకళ్లు చెదిరినవి; చెక్కులు పండినవి. అది రోడ్డు కాదు. కారు ఆగిపోయిన చోటు కాదు. అయినను ఆమెదృష్టి నిశ్చలమైపోయినది.

పేర్రాజు చేయి చాచి 'ఇటు తే' మ్మన్నాడు. పుండరీకం నవ్వుతూ, 'బాబూ! డబ్బు ముందర పెట్టెలో వేసుకుంటా వేం? అమ్మాయికి రెట్టింపుసొమ్ము అందియ్యాలి, తెలుసునా?' అన్నాడు. 'నీమొగంలే, ఇటు తేవోయ్! మాఅమ్మాయికి సొమ్మేమిటి?' అంటూ ఆయన పుండరీకంకండువా పట్టుకొని లాగాడు. నాగవల్లి వేళ అయింది. అందఱూ లేవబోతున్నారు. ఉత్తరీయం రెండుబుజాల మీదా విసురుకుంటూ 'ఆజ గగనమే జయ గీతాలీ' అనుకుంటున్నాడు పుండరీకం.

సుందరమ్మ కన్నులు మూసుకొన్నది; తెరిచి చూచింది. అది పందిరి; అడ్డమైన జనమూ ఉన్నారు. చరచరా లోపలికి పోయింది.

"సుందరమ్మ పాటలు పాడకుండానే పోతున్నది—" అన్నది సుశీల. ఆమె తిరిగి చూడలేదు. అయినా బాగుండదని, 'హారతిపళ్లెం సరిగా వెయ్యరని అలిగిపోతుందా యేమిటమ్మా' అన్నది సుశీల. సుందరమ్మ అదృశ్య అయింది.

## 3

'సుందరీ'—

శ్రీనివాసరావుగారు క్రొత్తగా ప్రాక్టీసు పెట్టారు. అంతభాగ్యవంతుడికి కొంచెము ఆలస్యంగా పెండ్లి కావడం చూడడానికి ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ఇరవైయారేండ్లకు సుందరమ్మను వివాహమాడాడు. మరుసటియేడే ఆమె కాపరానికి వచ్చివున్నది. తను ఆమెను ప్రేమిస్తున్నాననుకుంటాడు. ఆమెకు తనే ప్రాణమని నమ్మాడు. ఆమె సహజంగా తనతో మాట్లాడడానికి సాహసింపదు; సిగ్గు. అప్పుడప్పుడు ఏదో ఒకమాట అంటే ముద్దు వస్తుంటుంది.

ఇప్పుడు, ముప్పైయేండ్ల పొట్టి భారీ మనిషి; మొగముమీద స్ఫోటకపుమచ్చలున్నవి. గొడుగు వేసుకొని కోర్టునుంచి అప్పుడే వచ్చాడు. బైసికి లున్నది గాని మూడుపూట్లా అది తొక్కలేక యింట్లోనే ఉంచి పోతాడు. గబాగబా మేడపైకి పోయి పిలిచాడు. భార్య పలికినట్లు లేదు. జేబురుమాలుతో మొగముమీది ముత్యాలు పాడుజేసుకుంటూ మళ్లీ పిలిచాడు:

'సుందరీ'—

సుందరమ్మ కిటికీదగ్గర కూర్చుండి వీథి వంక చూస్తూవుంది. భర్తమాట ఆమెకు వినబడింది గాని పలకటానికి సత్తువ లేదు. ఆమె గొంతులో యేదో ఉండగట్టి గిరగిర తిరిగింది. ఆకిటికీలోనుంచి రోడ్డుమీదికి, ఆచోటికే, చూస్తూవున్నది. కాని అక్కడ ఏమీ లేదు. ఏమైనా వున్నా, ఆమెకు కనబడటానికి వీలు లేదు. ఆమెదృష్టికి పలుచని నీటితెర వొకటి అడ్డపడి వున్నది.

శ్రీనివాసరావు పైగుడ్డ మంచముమీద పారవేసి, మెల్లగా పోయి భార్యభుజముల పైన చేతులు వేశాడు; హాయి అనుకొన్నాడు. పన్నీటిలో తడిసిన బంగారుబొమ్మవలె ఉన్నది సుందరి. రోగివలె మెల్లగా ఆమె వెనుకకు తిరిగి చూచింది. ఆకంటిపొరలవెనుక, విషాదచ్ఛన్నమైన మూర్తి ఒకటి, ఆమె మనస్సు సృష్టించుకొన్న మూర్తి ఒకటి, నాట్యముచేస్తున్నది. 'ఉత్తరీయ మేదీ?' అని అకస్మాత్తుగా అన్నదామె. అతడు బిత్తరపోయి 'ఇదేమే, ఇట్లా వున్నావు? నే నెవరిని?' అన్నాడు.

ఆమెకు ఏడుపు వచ్చింది; వీథివైపుకు చూడగా ఆగిపోయింది; భర్తవైపు మళ్లీ చూడగా మళ్లీ వొచ్చింది. సిగ్గుపడి చివాలున లేచిపోతున్నది.

'ఇవ్వాళ టీ లేదా?'

సుందరమ్మ మాట్లాడకుండా దిగిపోయింది.

అసలే అతని కనుమానము. ఈపది రోజులబట్టీ యీవిచిత్ర మేమిటి? ఆనాడు— ఇవ్వాళ—ఈప్రవర్తన మేమిటి?

తనభార్యకు సొమ్ములు పెట్టినది తాను; అన్నము పెట్టుచున్నది తాను; పైగా, ఆమెను

పెళ్లి చేసుకున్నది తాను. ఆమె తనతో ఎందుకు మాట్లాడదు?

తనకు అంద మున్నది; ఆస్తి వున్నది; వయస్సున్నది; హృదయ మున్నది—తనతో సుందరి మాట్లాడ దెందుకు సరిగ్గా?

ఆమె తాను చెప్పిన పనియెల్లా చేస్తుంది; తను ఏది కావలె నంటే అది యిస్తుంది; తనకు లోబడి వుంటుంది—మరి మాట్లాడ దెందుకు?

అతడు కిటికీలోనించీ చూశాడు. పేర్రాజుగారి యిల్లు బాగా కనబడుతున్నది. తులిశమ్మ బయట అంట్లు తోముతున్నది. బాబురావు బర్రెదూడకు మేత వేస్తున్నాడు. పక్కగదిలో అద్దెకు వున్న కుఱ్ఱవా డెవరో పడకకుర్చీలో కూర్చుని చదువుకుంటున్నాడు. అతణ్ణి యెక్కడనో చూచినట్టుంది. ఎక్కడబ్బా!

ఇంతలోనే టీ తీసుకొని సుందరి వచ్చింది. భర్తముందు అది పెట్టి తల వంచుకొని నిలబడ్డది. ఆలోచనలో మునిగివున్న అతడది ముట్టుకోకుండానే, 'సుందరీ! పేర్రాజుగారి గదిలో అద్దె కున్నవా రెవ్వరే' అని యాదాలాపంగా అడిగాడు.

ఆమె ఉలికిపడ్డది. నిలువున వొణికింది. తల మరింత వొంచుకొని, 'నా కేం తెలుసు?' అంటూ పోబోయింది.

'నీవు సాధారణంగా పోతూవుంటావుగా?'

ఆమె యిక నిలువలేక, తొందరగా దిగిపోతూ, 'నా కివ్వాళ తలనొప్పిగా వుంది' అని గొణుగుకొన్నది.

౪

పొద్దు గూకింది. పేర్రాజుగారి ప్రహరీ ముందు వచ్చి నిలుచున్నారు శ్రీనివాసరావుగారు. ఆకుఱ్ఱవాడు ఇంకా చదువుకుంటూనే వున్నాడు. పడకకుర్చీకి అంటుకు పోయింది అతని దేహం. ఒంటిమీద రుద్రాక్షంచు ఉత్తరీయం ఎగుడుదిగుడుగా పడి వేలాడుతున్నది.

'అబ్బాయీ!'

'ఎవరండీ?'

'పంతులుగా రున్నారమ్మా?'

'నాకు తెలియదు. పక్కన కనుక్కోండి.'

'ఓహో! మీరు బాడుగకు ఉంటున్నారా? ఏమిస్తావు నాయనా, ఈగదికి?'

'కూర్చోండి. మూడురూపాయలు.'

'చదువుకుంటున్నావా?'

'బి. ఏ.'

'నీపేరు?'

'పుండరీకాక్షుడు అంటారు.'

శ్రీనివాసరావు నిదానించి చూచాడు. అతని కళ్లలో ఆగ్రహం, ఈర్ష్య, భయం అవతార మెత్తివున్నవి. పుండరీకాని కేమీ అర్థం కాలేదు. 'నాతోటి యేమన్నా పని వుందా అండీ?' అన్నాడు.

'లేదు' అంటూ ఆయన వెనక్కి తిరిగి తమమేడమీదికి చూస్తూ తిరిగిపోయినాడు. ఆకిటికీవద్ద సుందరిసుందరనయనద్వయము మెరుస్తున్నది. కాని అందులో సంపూర్ణమైన మానవలోకవిశాలదృష్టి లేదు. అవి ఒకటే లక్ష్యముమీద నిలిచివున్నవి. భర్త ఆమెకు కనబడనే లేదు.

పుండరీకం పుస్తకం మూసి, ఉత్తరీయం పైన కప్పుకొని, కళ్లజోడు తుడిచిపెట్టుకొని, గదికి తాళంవేసి, షికారుకు బయలుదేరాడు; తలకాయ వంచుకొని కూనరాగం తీసుకుంటూ శ్రీనివాసరావుగారి యింటిముందఅగా నడిచిపోతున్నాడు.

శ్రీనివాసరావు కాళ్లజోడు చప్పుడు చేసుకుంటూ మెట్లమీద నడుస్తున్నాడు. పైనుంచి, తలుపు లన్నీ తెరిచివేసి, దుఃఖపూరిత నయనాలతో వీథివంకకే చూస్తూ సుందరి పరుగెత్తుకొని వస్తున్నది. అతని తలపైన పిడుగు పడింది. ఆశ్చర్యంతో "ఎక్కడికే సుందరీ?" అని అడిగాడు.

ఆమె కేమీ అర్థముకాలేదు. ఈలోకములో లేదు. తనమనసులో మూర్తి, కన్నులలో మూర్తి కలిసి ఒకటైనవి. తల వంచుకొని లోపలికి పోయింది.

శ్రీనివాసరావు మరి భోజనము చేయలేదు. సైకిలు వేసుకొని బయలుదేరాడు. విసుగు పుట్టిందాకా తిరిగాడు. ఇంటికి వచ్చి తల పట్టుకొని కూర్చున్నాడు. మంచముమీద పడి అటూ యిటూ పొర్లాడు. ఎంతసేపటికీ మనస్సు కుదరలేదు.

అర్ధరాత్రివేళకు లేచి తనభార్యకోసం చూశాడు. ఆమె పక్కమీద లేదు. కిటికీ దగ్గర కూర్చునివున్నది. ఆశ్చర్యపడ్డాడు. ఆలోచించకుండా మేడ దిగి పేర్రాజుగారి యింటి వద్దకు పరిగెత్తాడు.

"అబ్బాయీ! పుండరీకం!"

రెండుమూడు పిలుపులకు గాని అతడు లేవలేదు. పొద్దుపోయిందాకా చదువుకున్నాడు కాబోలు. తెల్లవారితే సెలెక్షన్సు ప్రారంభం. మూడున్నరకు అలారం పెట్టి పడుకున్నాడు. అర్ధరాత్రప్పుడు ఎవరు వచ్చి పిలుస్తారు? తలుపు తీసి చూస్తే సాయంకాలం వచ్చిన పెద్దమనిషి ప్రత్యక్షం!

'ఏమిటండీ?'

'నువు కవిత్వం రాస్తావుట గదూ?'

'ఎందుకు?'

'నీకు దేవు డెప్పుడన్నా కనపడ్డాడా?'

'మీ రెందుకు వచ్చారో చెప్పండి?'

'నీకు దేవుణ్ణి చూపించడానికి—'

'ముందు నీసంగతి చెప్పవయ్యా, దేవుడా!'

పుండరీకానికి భయం పుట్టింది. శ్రీనివాసరావు చేతులో పిస్తోలు తీసి పట్టుకున్నాడు.

'దుర్మార్గుడా! నీవు నాసుందరిని వదలిపెట్టు—'

'ఎవరు సుందరి?—ఇదేమిటో నా కర్థం కావడం లేదు.'

మఱుక్షణంలో శ్రీనివాసరావుచేతులో ఉన్న పిస్తోలు ఢామ్మని మ్రోగింది. పొగ తగ్గిందాక అతడు బైట పడి, యింటివద్దకు పరిగెత్తాడు. మేడమీదికి చూశాడు. సుందరి కళ్లు రెండూ, ఆకిటికీలోనుంచి దూరానికి చూస్తూ, చీకటిలోకూడా మెరిసిపోతున్నవి. ఆకంటిపొరలలో లోతుగా ఒకమూర్తి ప్రకాశిస్తుంది—సన్నగా, పొడుగ్గా, ఉత్తరీయంతో కళ్లజోడుతో.........

---

## అస్పృశ్యత కర్థము గలదా ?

